❖•❖•❖ 11 ❖•❖•❖

# దేవుని కుమారుడు పట్టబడుట

*"అంతట సైనికులును సహస్రాధిపతియు, యూదుల బంట్రౌతులును యేసును పట్టుకొని ఆయనను బంధించిరి ..." (యోహాను 18:12).*

మన మధ్యకు వచ్చి మనతో కూడ నడిచి మన కొరకు మరణించినవాడు, దైవత్వములోని రెండవ సభ్యుదును, దేవుని కుమారుడునైనవాడుగాక మరెవరూ కాడను విషయము

క్రొత్త నిబంధనలోని ఒక ముఖ్యమైన సత్యమైయున్నది. గమనార్హమైన ఈ వాస్తవమును యోహాను స్పష్టముగాను ఎట్టి పరిస్థితులలోను మరచుటకు అవకాశమేలేని విధముగాను ప్రకటించుచున్నాడు: "ఆ వాక్యము శరీరధారియై, కృపాసత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను; తండ్రివలన కలిగిన అద్వితీయకుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి" (యోహాను 1:14). మిక్కిలి ఆశ్చర్యము కలిగించు విషయమేమనగా, పశువుల శాలలోని తొట్టిలో శిశువుగా పుట్టిన ఈ యేసే (లూకా 2:11, 12), "ఆకాశ మందున్నవియు భూమియందున్నవియు, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయనద్వారాను ఆయననుబట్టియు సృజింపబడెను" అని పౌలు భక్తుడు వ్రాసినవాడై యున్నాడు (కొలొస్సయులకు 1:16).

యేసును గూర్చిన ఈ గంభీరమైన సత్యమును ఒకసారి అర్థంచేసుకొన్నామంటే, లౌకికముగాను అలౌకికముగాను సత్యమైయున్న మిశ్రమమును, అనగా ఆయన యొక్క ఇహలోక జీవితమునకు ఎంతో సాక్ష్యముగా నున్న దైవీకమును మానవీయమునైన అల్లికను, అంగీకరించుట మనకు కష్టము కాదు. యాకోబు బావి యొద్ద సమరయ స్త్రీతో జీవజలము గూర్చి సంభాషించిన (యోహాను 4:10 చూడుము) ఆయన దాహము గొనలేదని మనము సందేహపడము (యోహాను 4:6, 7). ఆయన దేవుని కుమారుడని యేసు యూదుల మహా సభ యెదుట ఒప్పుకొనిన విషయముచేతను (లూకా 22:70) ఆ తరువాత, కొద్దిసేపటికే, తనను తాను బహిరంగముగా ఒక రోమీయుల సిలువపై చంపబడుటకు అనుమతించుటనుబట్టియు (లూకా 23:33) మనము విభ్రాంతినొందము.

దైవీకమును మానవీయమునైన వాడైయుండెననుట అనగా, యేసును గూర్చినది ఏదియును సామాన్యమైనదై యుండదని అర్థము. ఆయన పుట్టుక, బాప్తిస్మము, శోధనలు, బోధలు, మరియు మరణము, అన్నీ విశిష్టమైనవే, ఆయన తోటలో పట్టబడుట సహితము చరిత్రలోని సమస్త నిర్బంధముల నుండి దానిని ప్రత్యేకమైనదానిగా సూచించు లక్షణములుగలదై యున్నది. దేవుని కుమారుడు పట్టబడిన ఆ అంధకార క్షణము గూర్చి అవలోకనము చేయు ప్రతివాడును ఆయన దైవత్వ మహిమ ఈ సంఘటనలన్నిటిలోను ఎలా గమనించబడినదో గ్రహించుదురు.

*ఆయనను పట్టుకొనుటకు వచ్చిన సమూహమును ఆయన ఎదుర్కొనుటలో మనము ఆయన దైవిక/మానవీయ స్వభావమును చూచుచున్నాము.* ఆయనను సమీపించిన గుంపు వందల సంఖ్యలో ఉంటుంది. ఆ గుంపులో రోమా సైనికులు, ప్రధాన యాజకులు మరియు ప్రజల పెద్దలు, దేవాలయ భద్రతా సిబ్బందికి సంబంధించిన అధికారులు, మరియు బహుశా జిజ్ఞాసతె పట్టణములో నుండి వచ్చి చేరిన ప్రజలు ఉన్నారు. "వానితో కూడ బహు జనసమూహము కత్తులు గుదియలు పట్టుకొని … వచ్చెను" అని మత్తయి చెప్పుచున్నాడు (మత్తయి 26:47బి). వారెవరై యుండిరో, వారెందుకు వచ్చారో, ఆయనకు ముమ్ముందు ఏమిజరుగనైయున్నదో ఇవన్నీ తెలిసి కూడ, యేసు వారి యొద్దకు వెళ్ళి, "మీరెవని వెదకుచున్నారు?" అని అడిగాడు (యోహాను 18:4). జనసమూహమును నడిపించుచుండినవారు, ఆయన నడవడిక మరియు హావభావాలనుబట్టి దిగ్భ్రమచెంది, ఆకస్మికముగా వెనుకకు తగ్గారు, వారిని గుద్దుకొనుచు కొందరు నేలపైబడునట్లు చేసారు. ఆ గుంపంతా కోలుకొని మరలా కూడుకొన్నప్పుడు, "నేనే

ఆయనని మీతో చెప్పితిని; గనుక మీరు నన్ను వెదకుచున్నయెడల వీరిని పోనియ్యుడి" అని చెప్పుచూ యేసు మరలా తనను తాను వారి వశము చేసుకొన్నాడు (యోహాను 18:8).

ఉద్రిక్తముగానున్న ఈ క్షణములో యేసు వ్యక్తిత్వము, దైవత్వ స్వాభావిక లక్షణముల గూర్చి మనకు తెలిసినదానంతటితో పొందికగా ఉండినది. జీవితము మరియు రానైయుండిన రాజ్యము గూర్చిన సత్యమును ఆయన బహిరంగముగా, దేవాలయ ప్రాంగణములో సహితము బోధించాడు. ఆయన తన కార్యములను రహస్యముగా చేయలేదు. ఆయన ఈ లోకములో చేయుచుండిన వాటన్నిటి విషయములో బాహాటముగా ముక్కుసూటియైనవాడునై యుండెను. ఆయనను పట్టుకొనుటకు వచ్చినవారు ఒక దురుద్దేశముతోను ఆయన క్రూరముగా ప్రవర్తించు ఒక ప్రతినాయకుడను పటమును వారు మనస్సుల్లో ఉంచుకొని వచ్చారు - కానీ వారు ఒక రాకుమారుని, ఒక రాజును, పరిపూర్ణుడైనవానిలో ఉండవలసిన గుణగణములన్నిటిని కలిగియుండినవానిని పట్టుకొనుచుండిరని తెలుసుకొన్నారు.

*మరొకసారి, ఆయన యూదాతో వ్యవహరించిన తీరులో ఆయన మహిమను చూచుచున్నాము.* యూదా గూర్చి యేసుకు తెలియనదంటూ ఏమియు లేదు. మేడగదిలో అందరితో కూడ ఉండిన యూదా అక్కడ నుండి అంధకారములోనికి కనుమరుగైనప్పుడు, వాడు ఏమి చేయనైయుండెనో ఎలా చేయనై యుండెనో యేసు పూర్తిగా ఎరిగియుండెను. సాతాను వానిని శోధించుచుండెనని ఆయన యూదాను మృదువుగా మందలించాడు (మత్తయి 26:25).

తోటలోనున్న యేసును యూదా సమీపించినప్పుడు, వాడు ఆయనను అప్పగించుచుండెనని ఆయన యూదాకు స్పష్టముగా తెలియజెప్పాడు (లూకా 22:48). యూదా, యేసు చెప్పిన విషయాన్ని నిర్లక్ష్యముచేస్తూ, ఆయనను ముద్దుపెట్టుకొన్నాడు. వాడు యేసును అప్పగించు విద్రోహ చర్యకు ముద్దును ఒక ముంగుర్తుగా ఎన్నుకొన్నాడు. యూదా, వ్యక్తిగత స్నేహము మరియు అనురాగమునకు సంకేతమై యున్నట్లు ఆయనను ఆలింగనము చేసుకొనుచూ ముద్దుపెట్టియుండును. వాడు యేసు యొద్దకు వెళ్లి, "బోధకుడా, నీకు శుభము!" అని చెప్పినట్లు మత్తయి వ్రాయుచున్నాడు (మత్తయి 26:49). యూదా ఉపయోగించిన *kataphileo* అను గ్రీకు పదమునకు "చిత్తశుద్ధితో, గాఢముగా, లేక మళ్లీ మళ్లి, ముద్దుపెట్టుకొనుట" అని అర్థము. ఒక పరిసయ్యుని ఇంటిలో యేసు పాదములకు అత్తరు పూసి ఆయన పాదములను ముద్దుపెట్టుకొనిన స్త్రీని వివరించుటకు ఇదే పదము ఉపయోగింపబడినది (లూకా 7:38).

యూదా ఈ పిరికిపందయైన చర్య చేయకుండా యేసు వానిని నిరోధించకపోవుట ఎంత వింతైన విషయము కదా! యూదా ఆయనను ముద్దుపెట్టుకొనునట్లు అనుమతించాడు కానీ, వాని పట్ల ఎటువంటి వైరభావమును ప్రదర్శించలేదు. గనుక ఆయన చేసిన ఈ చర్యలు ఆయన యొక్క దైవత్వ పరిభాషలోనే వివరించబడగలవు. వాని మానవ స్వాతంత్ర్యమును సద్వినియోగము చేసుకొనుటకు యూదాకు అవకాశమిచ్చాడు. ఆయన వానికి బోధించుచు హెచ్చరించుట మాత్రమే గాక, చేయవలెనని వాడు నిర్ణయించుకొన్న కార్యమును చేయుటకు వానికి నైతిక స్వేచ్ఛను కూడా ఇచ్చాడు.

*ఇంకా, యేసు మల్కు చెవిని బాగుచేయుటలో ఆయన దైవత్వమును మనము చూచుచున్నాము.* యేసు ఇహలోక జీవితమును అధ్యయనముచేయు ప్రతివాడు ఆయన ఎవరైయుండెనో అను అంశము గూర్చి అద్భుతకరమైన నిదర్శనమును చూచుటకు

అలవాటుపడిపోవును. ఆయన పట్టబడినప్పుడు, ఆయన తండ్రిచేత పంపబడినాడని సాక్ష్యమిచ్చిన కరుణాకటాక్షము మరియు బలము గూర్చి ఆయన లోకమునకు మరొక దృశ్యమును అనుగ్రహించాడు.

పేతురు దుడుకుతనముతో తన కత్తిని దూసి ప్రధాన యాజకుని దాసుడైన మల్కు చెవిని తెగనరికినప్పుడు, యేసు ఆ చెవిని ముట్టి దానికి తక్షణ స్వస్థతను చేకూర్చాడు. ఊగులాడుచుండిన ఒక చెవి బాగుచేయబడినది, అది చరిత్రలో చిరస్మారక బోధనా క్షణమును సమకూర్చినది. యేసు లోకపాపముల కొరకు మరణించక మునుపు, సిలువ మీద మరణించుటకు కొనిపోబడుచుండిన వాని దైవత్వమును నిర్ధారణచేయుటకు నిరాక్షేపణీయమైన ఆనవాలు ఆయన అనుగ్రహించాడు. ఆయన ప్రదర్శించిన అద్భుతకరమైన నిదర్శనము ఆయనను బంధించుచుండిన వారి నిమిత్తము, ఆయన శిష్యుల నిమిత్తము, మరియు వారి ఆత్మలను రక్షించగల రక్షకుని కొరకు వెదకుచుండు వారందరి నిమిత్తమైనదై యుండెను.

*ఇంతేగాక, శిష్యుల గూర్చి ఆయన పలికిన ప్రవచనము నెరవేరుటలో మనము ఆయన మహిమను చూచుచున్నాము.* గొఱ్ఱెల కాపరి కొట్టబడును, అప్పుడు వారందరును చెదరిపోవుదురని ఆయన వారితో చెప్పియుండెను (మత్తయి 26:31). యేసు మల్కు చెవిని ముట్టి బాగుచేసిన కొద్ది సేపటికి, అపొస్తలులందరు ఎవనికి ఎదురుగా నుండిన మార్గములో వాడు, పరుగెత్తుకొని పారిపోయారు. ఆయనను పట్టుకొనుచుండిన అధికారులతో, "వీరిని పోనియ్యుడి" అని యేసు చెప్పాడు (యోహాను 18:8). సానుకూల పరిస్థితి గల సమయము సమీపించినప్పుడు, ఆయన శిష్యులు తొందరగా తప్పించుకొనిపోయారు. ఇళ్ల వెనుక దాగుకొనగలుగునట్లు, కొందరు పట్టణమువైపు పరుగెత్తారు; అంధకారము వలన అగుపించకుండా దాచబడగలరని కొందరు కొటలోనికి పరుగెత్తారు. అటుతరువాత, వారు దాగుకొని యుండిన చోట్ల నుండి పేతురు మరియు యోహాను బయటికి వచ్చి వారి యజమానుడు వెళ్లుచుండిన మార్గములో దూరములో వెనుక నుండి వెళ్లారు, కానీ మిగిలినవారు యింకా దాగుకొనే యుండిరి.

ఒక యువకుడు, బహుశ మార్కు అయియ్యుంటాడు, సందడి సృష్టించిన సంచలనము వలన కలిగిన అల్లరి వాని నిద్రను భంగపరిచినందున నిద్ర మత్తులో నుండి మేల్కొని యుంటాడు. నారబట్టను మాత్రమే చుట్టుకొనియుండి అతడు, యేసును పట్టుకొనుటకు వెళ్లుచుండిన జనసమూహము వెంటబడ్డాడు. యేసుని గూర్చి అతడు ఆసక్తి కలిగియున్నాడని అతడు ఏదో ఒక విధముగా సూచించియుంటాడు. శిష్యులు చెదరిపోయినప్పుడు, ఈ యువకుని ఒక సైనికుడు పట్టుకొన్నాడు. వాడు ఏదో ఒక విధముగా సైనికుని చేతిలో నుండి విదిలించుకొని పరుగెత్తి వెళ్లిపోయాడు. ఈ యౌవనుడు దిగంబరుడుగానే అంధకారములోనికి పరుగెత్తాడు, రోమా సైనికుని చేత వాడు కూడ పట్టబడకుండునట్లు కొంచెములో తప్పించుకొన్నానని వాడనుకొన్నాడంటే అందులో అనుమానంలేదు (మార్కు 14:51, 52).

అతనికున్న మహత్తరమైన బలమునకు అదనముగా అతడన్నిటిని తెలిసియుండెను. అతడు తన అపొస్తలుల బలహీన గుణములను సైతము ఎరిగియుండెను. అతడు తన శిష్యుల గుంపు ఏమి చెయనున్నారో అను జ్ఞానము కలిగియుండెను. అతడు ఏమి జరుగునో ఊహించినవన్నియు నిజమని జరిగిన విషయములన్నిటి వలన నిశ్చయమైనది.

ఆ *చారిత్రాత్మక గడియ గూర్చి ఆయన వేసుకొన్న సరియైన అంచనాలో ఆయన దైవత్వము*

*కనబడుచున్నది.* "ఇది మీ గడియయు అంధకార సంబంధమైన అధికారమును" అని ఆయనను పట్టుకొనుటకు వచ్చినవారితో చెప్పాడు (లూకా 22:53బి). సంభవించుచుండిన భయంకరమైన సంఘటన స్వభావము గూర్చి మనము అవగాహన చేసుకొనునట్లు మనకు సహాయము చేయుటకు దేవుని దైవికమైన కుమారుడు ఏదో ఒక విషయము చెప్పునని మనము ఆశిస్తాము. కళ్లకు కట్టినట్లుండినదైనా ఆయన ఇచ్చిన కొంచెము వివరణము ఈ ఉదంతము యొక్క పైశాచిక స్వభావమును బయలుపర్చినది.

తోట ద్వారము దగ్గర సంభవించిన ఈ సంఘటన ఎంత నిరాశామయమైనదిగాను విషాదాంతమైనదిగాను ఉన్నది కదా! మరణమును తప్పించుకొనజాలని, పాపిష్టియైన మానవులు ఆయన ఏదో ఘోర నేరము చేసిన నేరస్తుడైనట్లు దేవుని పవిత్రమైన కుమారుని పట్టుకొనిపోవు దాని పరిమాణములను ఎవరైనా అవగతము చేసుకోగలరా? వీరు మాటల్లో వివరింపరాని ఈ కార్యమును చేయుటకు బేరమాడారు, యుక్తితో రూపొందించుకొన్నారు, మరియు ఎన్నుకొన్నారు. వారు యేసును పట్టుకొని బంధించినప్పుడు, అన్ని గడియల కంటె అత్యంత అంధకారమైన గడియలు వారిని అలుముకొన్నవి. వారు వారిని చుట్టుముట్టి వారి హృదయాలలో నిండియుండిన దుష్టుని శక్తివంతమైన అధికారమునకు లొంగిపోవుచుండిరి.

దేవుని కుమారుడు పట్టబడుట ఆయన స్వభావమునకు సంబంధించిన మానవీయ మరియు దైవీకమైన కోణములను మనకు తెలియజెప్పుచున్నది. ఆయన తాళ్లతోను, కత్తులతోను, మరియు గుదియలతోను పట్టబడి తీర్పు తీర్చుబడుటకు కొనిపోబడుట గమనించినప్పుడు మనము యేసు యొక్క మానవత్వమును చూడగలము. ఏదిఏమైనా, పొరబడకుండా స్పష్టముగానున్న ఆయన మహిమ మరియు దైవత్వము ఈ సంఘటనల యందతటను కాంతివంతముగా ప్రకాశించుచున్నవి. దీని గూర్చి సువార్తల రచయితలు రచించిన వివరములను మనము చదువునప్పుడు, యేసు, దేవుని కుమారుడైన వాడు, మన పాపముల నిమిత్తము మరణించునట్లు కఠినహృదయులు, దుష్టులునైన మానవులు ఆయనను పట్టుకొనునట్లు అనుమతించుటకు సదుద్దేశముతో ఆంగీకరించాడు అను సత్యముతో మనము అమితోత్సాహభరితుల మగుచున్నాము.

❖◆❖◆❖

*ఆయన ఏమాత్రమైనను మానవుడై యుండలేదన్నట్లుగా యేసు ఎంతగానో దైవీకమైనవాడై యుండెను, మరియు ఆయన ఏమాత్రమును దైవీకమైనవాడై యుండలేదన్నట్లుగా ఎంతగానో మానవుడై యుండెను. ఆయన దైవత్వము మరియు మానవత్వము ఒక్క వ్యక్తిత్వములో మేళవింపబడియున్న పరిపూర్ణమైన సమ్మేళనమై యుండెను. లేఖనములలో ఆయన, "మనుష్యకుమారుడు" అనియు "దేవునికుమారుడు" అనియు పిలువబడుచున్నాడు. ఆయనను గూర్చిన ఈ సత్యమును మనము ఆకళింపు చేసుకొన్నట్లయితే, ఆయన గూర్చి క్రొత్త నిబంధనలో బోధింపబడుచున్న మిగిలిన సత్యములన్నిటిని నమ్ముటకు మనకు ఎటువంటి ఇబ్బంది ఉండదు.*